

అమ్మరూపం..ఆకర్షణీయం



దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మేళ్లచెరువులోని వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో ఆకర్షణీయంగా అలంకరించారు.
- మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా కోదాడలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- కోదాడ పట్టణం, న్యూస్‌టుడే



భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలి: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, పూలను పూజించే గొప్ప సంస్కృతి ఇక్కడే ఉందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయ దశమి సందర్భంగా జిల్లా ప్రజలకు వారు కోరుకున్న రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో దసరా పండగ జరుపుకోవాలని కోరారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామ పంచాయతీలకు ఊరట

☛ జిల్లాకు రూ.9,04 కోట్ల నిధులు విడుదల



ఏపూరు పంచాయతీ కార్యాలయం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పల్లెల్లో సర్పంచులు పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కొన్ని నెలలుగా నిధులు లేకపోవడం, అటు ప్రత్యేక పాలనలో అధికారులు అందుబాటులో ఉండక, సౌకర్యాలు సమకూరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ పాలన కొనసాగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. పల్లెల పరిస్థితి దారుణంగా ఉండటంతో రాష్ట్రం ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. జిల్లాకు పాత రూ.కోటితో కలుపుకొని రూ.9.04 కోట్లను మంజూరు చేసింది.

కార్మికుల హర్షం

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల 11 పంచాయతీలను అదనంగా ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 486కు చేరింది. ఆయా పంచాయతీల జనాభా ఆధారంగా రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం పంచాయతీలకు మూడు రకాల నిధులు విడుదల చేయడంతో కొంత మేర ఊరట లభించింది. రెండు నెలల మల్టీపర్పస్, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్తు బిల్లులకు డబ్బులు మంజూరయ్యాయి. విజయ దశమి నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో 1862 మంది పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పాలన మొదలయ్యాక నిధులు విడుదల కావడం ఇదే ప్రథమం.

నిధుల మంజూరు ఇలా..

మల్టీ పర్పస్ కార్మికుల వేతనాలకు	రూ.3.74 కోట్లు
ట్రాక్టర్ కిస్తీ	రూ.33.51 లక్షలు
ఇతర ఖర్చులకు	రూ.4.62 కోట్లు

వేతనాలు చెల్లించాం – నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట

రెండు నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులు జమ కాలేదు. ఇటీవల మంజూరయ్యాయి. వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాం. ట్రాక్టర్ కిస్తీలూ కట్టాం. విద్యుత్తు బకాయిలు కూడా వెంటనే మంజూరు చేస్తాం.

తహసీల్దార్ జయశ్రీని విచారించిన పోలీసులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి ఇతరుల పేర్ల మీదకు మార్చి, దానిపై రైతుబంధు నిధులు కాజేశారన్న ఆరోపణలపై అరెస్టయిన హుజూర్‌నగర్ గత తహసీల్దార్ జయశ్రీకి పోలీసులు తీసుకున్న ఒకరోజు కస్టడీ ముగిసింది. శుక్రవారం ఉదయం హుజూర్‌నగర్ పోలీసులు ఆమెను సబ్ జైలు నుంచి హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయానికి తరలించి సీఐ చరమందరాజుకు అప్పగించారు. సీఐ చరమందరాజు ఆమెను విచారించారు. విచారణ మధ్యలో ఒకసారి వేరే ప్రాంతానికి కూడా తీసుకుపోయారు. ఎక్కడికి తీసుకు వెళ్లారనేది గోప్యంగా ఉంచారు. విచారణ అనంతరం హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ సెలవులో ఉండటంతో ఆమెను కోదాడ కోర్టులో హాజరు పర్చారు. అనంతరం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో చూపించి తిరిగి సాయంత్రం 5 గంటల తరువాత హుజూర్‌నగర్ సబ్ జైలుకు తరలించారు. ఒక రోజు విచారణ సరిపోని కారణంగా పోలీసులు తిరిగి సోమవారం పోలీస్ కస్టడీ కోసం పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

దసరా శుభాకాంక్షలతో...

ఈనాడు, నల్గొండ:

చెడుపై మంచి విజయానికి గుర్తుగా చేసుకునేదే విజయదశమి. దీనిని 'దసరా' అని 'దశహరా' అని పిలుస్తారు. అంటే పది పాపాలను హరించేది అని అర్థం. దేవదానవులు పాల సముద్రాన్ని మదించినప్పుడు అమృతం జనించిన శుభముహూర్త దినమే ఈ విజయదశమి. తిథి, వారం, వర్జ్యం, తారాబలం, గ్రహబలం, ముహూర్తం చూడకుండా ఈ రోజున ఏ కార్యక్రమాలను ప్రారంభించినా, అంకురార్పణ చేసినా విజయాలు చేకూరుతాయని నమ్మకం.

అన్నదాతకు మరింత అండ

సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు, 560 గ్రామాలకు తాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుతో పాటూ డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే రెండేళ్లలో పూర్తయితే అన్నదాతకు మరింత అండ దొరకనుంది. ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఈ ప్రాజెక్టుల పూర్తితో ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటూ హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లోని చాలా ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరనుంది.



ఉద్యోగుల్లో గంపెడాశలు..

కొత్త ప్రభుత్వంలోనైనా తమకు పీఆర్‌సీతో పాటూ పెండింగ్‌లో ఉన్న డీఏలు వస్తాయని ఉద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. మరో 10 వేల మంది వరకు పెన్షనర్లు ఉంటారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకూ సకాలంలో వారి రిటైర్మెంట్ డబ్బులు రావడం లేదు.



★ ప్రభుత్వం సైతం ఉద్యోగుల డిమాండ్లకు సానుకూలంగా ఉండటంతో తమకు త్వరలోనే మరో విజయదశమి రానుందని నమ్ముతున్నారు.

గతేడాదితో పోలిస్తే ఈ పండగ ఉమ్మడి జిల్లాలోని పలువర్గాలకు ప్రత్యేకం కానుంది. గతేడాది సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల కింద పడావుగా ఉన్న భూములు ఇప్పుడు పొలాలతో కళకళలాడుతున్నాయి. ఏళ్ల నుంచి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడంతో పాటూ నియామకాల్లోనూ వేగం పెంచడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికీకరణలో ఇతర జిల్లాలతో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. రహదారి, రైలు మార్గాలతో పాటూ వాయుమార్గం సైతం సమీపంలో అందుబాటులో ఉన్న ఉమ్మడి జిల్లాలో.. మరిన్ని పరిశ్రమలు స్థాపించి యువతకు వచ్చే దసరాలోపు కొలువులు ఇస్తేనే వారికి నిజమైన దసరా.

నిరుద్యోగుల్లో ఆనందం

ఏళ్లుగా నోటిఫికేషన్లు లేక, పరీక్షలు రాసినా ఫలితాలు రాక నిరీక్షిస్తున్న నిరుద్యోగులు ప్రస్తుతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల కాలంలోనే విద్యుత్తు, నీటిపారుదల శాఖలో ఇంజినీర్ల పోస్టులను భర్తీ చేశారు. విద్యాశాఖలో గురుకులాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను వేల సంఖ్యలో భర్తీ చేశారు. చాలా మంది ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా.. ఒకట్రెండు రోజుల్లో గురువులు బడులకు వెళ్లనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1200 మంది ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరనున్నారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు రంగం సిద్ధం కాగా.. గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు త్వరలోనే జరగనున్నాయి.

★ ఈ పరీక్షలన్నీ పూర్తి చేసి సకాలంలో పోస్టులను భర్తీ చేస్తే నిరుద్యోగుల్లో మరింత పండగ కళ రానుంది.







వేగంగా..పారిశ్రామికీకరణ

ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, సూక్ష్మ కంపెనీలన్నీ సుమారు 6 వేలకు పైగా ఉన్నాయి. ఇందులో ఎక్కువగా ఫార్మా కంపెనీల్లోనే ప్రజలు ఉపాధి పొందుతున్నారు. మానవ వనరులున్నా.. వారికి అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలు లేకపోవడంతో చాలా మంది ఇంకా ఉపాధి కోసం ఎదురుచూసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. రాజధాని సమీపంలోని ప్రాంతాల్లో పరిశ్రమలను స్థాపించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి రాయితీలు కల్పిస్తోంది. ఇటీవలే రూ.3 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. ★ ఏటా ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ విద్యార్థులు వేల సంఖ్యలో చదువు పూర్తిచేసుకుంటున్నా అందులో కేవలం 10 శాతం మందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సరైన నైపుణ్యాలు లేకపోవడం తదితర కారణాలతో వారు ఉద్యోగాలు పొందడం లేదు. నల్గొండలో ఇటీవలే నైపుణ్య శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన చేశారు. త్వరలోనే పూర్తయి నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగాలు లభిస్తేనే యువతకు నిజమైన దసరా.

నిండుగా జలాలు..

రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జునసాగర్‌తో పాటూ మూసీ, డిండి, శాలిగౌరారం జలాశయాలు, వాగులు, వంకలు నిండుకుండలుగా మారడంతో మూడు జిల్లాల్లోనూ పొలాలు కళకళలాడుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 10.56 లక్షల ఎకరాల్లో వరి సాగును ఉమ్మడి జిల్లాలోనే సాగు చేస్తున్నారు. సుమారు 8 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా.. ప్రస్తుతం పంటలు కోతల దశకు చేరాయి. ఇప్పటికే రాష్ట్రంలోనే తొలిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని నల్గొండ జిల్లాలోనే ప్రారంభించారు. సన్నాల సాగు గతంతో పోలిస్తే గణనీయంగా పెరగడం, కొనుగోలు కేంద్రాల ద్వారానే ఈ ఏడాది మూడు జిల్లాల్లో సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లు సజావుగా సాగి అన్నదాతకు సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు జమయితేనే వారికి నిజమైన దశమి.

★ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డీజేతో ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దు

సూర్యాపేట నేరవిభాగం: వివాదాలు, గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో అందరూ కలిసిమెలిసి సంతోషంగా ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డీజేపై నిషేధం ఉందని, ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో, సంప్రదాయ పండగల ఏర్పాట్లలో యువత ఆదర్శంగా ఉండాలని తెలిపారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

ఆవిష్కరణల వేదిక.. మనక్



జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో విద్యార్థుల ఆవిష్కరణలను తిలకిస్తున్న ఉన్నతాధికారులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదువుతో పాటు సృజనాత్మకత అవసరం. ఆ క్రమంలోనే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారుచేసే కార్యక్రమం ఇన్‌స్పైర్ మనక్. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనడమే కాకుండా ఎక్కువ ఆవిష్కరణలు ఎంపికయ్యేలా విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఇన్‌స్పైర్ మనక్ విధివిధానాలు వివరించారు. ఉమ్మడి జిల్లా విద్యాధికారులు ఆయా జిల్లాల సైన్స్ అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఆయా బడుల ప్రధానోపాధ్యాయులు తగు సహకారం అందించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం అంతర్జాలంలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించాలని తెలిపారు. ముఖ్యంగా గతంలో జాతీయ స్థాయికి వెళ్లిన నమూనాల గైడ్ ఉపాధ్యాయులతో సూచనలు ఇప్పించి విద్యార్థులను ఆ దిశగా దృష్టి సారించేలా చూడాలని విద్యా శాఖ వర్గాలు సూచించాయి.

15 వరకు ఆఖరి గడువు

ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు ఆ శాఖ కసరత్తు చేస్తోంది. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 3,836 ఉండగా, ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న పాఠశాలలు 546 ఉండగా, 1,945 ఆవిష్కరణలు ఉన్నట్లుగా విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. విద్యార్థులు ఆవిష్కరణలు పంపడానికి జులై 1 నుంచి సెప్టెంబరు 15 వరకు గడువు విధించారు. అయితే అనుకున్న స్పందన రాకపోవడంతో అక్టోబరు 15వ తేదీ వరకు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేయడానికి గడువు పొడిగించారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా వివరాలు..

జిల్లా	ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు	రిజిస్ట్రేషన్ చేసుకున్నవి	ఆవిష్కరణల సంఖ్య
నల్గొండ	1,682	312	1,171
సూర్యాపేట	1,250	151	562
యాదాద్రి	904	83	212

ఎక్కువ మంది పాల్గొనేలా చూస్తున్నాం

– కె.నాగేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి, యాదాద్రి భువనగిరి



ఇన్‌స్పైర్ మనక్‌కు ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎలాంటి సందేహాలున్నా జిల్లా సైన్స్ కార్యాలయంలో నేరుగా సంప్రదించే అవకాశం ఉంది. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనడమే కాకుండా ఎంపిక కావడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం.

ప్రజల్లోకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసు: మాజీ మంత్రి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ పండగలో మహిళలు ఇష్టపడే బతుకమ్మ పాటలు అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒంట్లో వణుకు పుడుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ భయంతోనే రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతాల్లోనూ సౌండ్ సిస్టం లేకుండా, మహిళలు ఉత్సాహంగా పండగ చేసుకోకుండా చేశారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ ఛానళ్లను ఆపగలరేమో గాని ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. అతివలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాష్ట్రం కళ తప్పిందని, కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల్లోకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసని ఆయన వెల్లడించారు. దాడులు, కేసులు, నిషేధాలతో బతుకమ్మ పాటను ఆపలేరని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా తెలంగాణ మగువలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ ఛైర్మన్ పుట్టా కిశోర్, పెన్‌పహాడ్ మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి.. సూర్యాపేట (తాళ్లగడ్డ): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరిలో చెడు తొలగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. శమీ పూజ చేసి జమ్మిఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదని, పాలపిట్ట, జమ్మిచెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదల కష్టాలు తీర్చేందుకే మూసీ ప్రక్షాళన: ఎంపీ చామల



తిరుమలగిరి: తొండలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తదితరులు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలు తెచ్చి మూసీ కాల్వలో కలిపి పేదల సాగునీటి కష్టాలు తీర్చాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం తొండలో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ శిలాఫలకాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ మురుగు నీరు కారణంగా శాలిగౌరారం మండలంలో పండే పంటలు, చేపలను కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి మూసీ నదిని ప్రక్షాళన చేద్దామంటే ప్రతిపక్షాలు సామాజిక మాధ్యమాల ద్వారా విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లేవారికి గుణపాఠం చెప్పే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని, ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేందుకు ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే సామేల్ తెలిపారు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయించామని, తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో రూ.వెయ్యి కోట్లతో పరిశ్రమ స్థాపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎస్సారెస్పీ కాల్వ ఆధునికీకరణకు రూ. 65 కోట్లు మంజూరు చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఆర్డీవో వేణుమాధవ్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.కొండల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేశ్, నాయకులు పేరాల వీరేశ్, ధరావత్ జిమ్మిలాల్, కందుకూరి అంబేద్కర్ పాల్గొన్నారు.

గెలుపు సంకేతం.. విజయ దశమి

విజయానికి సంకేతంగా హిందువులు జరుపుకొనే పర్వదినం దసరా. ఆశ్వయుజ శుద్ధపాడ్యమి మొదలు నవమి వరకు తొమ్మిది రోజులు దేవీనవ రాత్రులు, పదోరోజు విజయదశమి(దసరా) పండగ జరుపుకొంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యం ఇచ్చే పండగ. కొన్ని ప్రాంతాల్లో కొందరు మొదటి మూడురోజులు పార్వతీదేవికి, తదుపరి మూడురోజులు లక్ష్మీదేవికి, మిగిలిన మూడురోజులు సరస్వతి దేవికి పూజలు చేస్తారు. సామాన్యులే కాక యోగులూ నవరాత్రుల్లో అమ్మవారిని పూజిస్తారు. ఈ పండగ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో అలంకరణలో పూజించి పదోరోజు పార్వేట చేస్తారు. జమ్మిచెట్టు ఉన్న ప్రదేశంలో పార్వేట చేయడం ఆనవాయితీ.

మోత్కూరు, న్యూస్‌టుడే:



వేడుకలు ఇలా..

విజయదశమి వేడుకలను ఏటా సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. పండగ రోజున గ్రామదేవతలైన గడి మైసమ్మ, కట్ట మైసమ్మలకు పూజలు చేస్తారు. ఆయుధాలను పెద్ద గ్రామపెద్దలంతా కలిసి వాటిని పూజిస్తారు. జొన్న చొప్పకట్టపై సొరకాయను ఉంచి నరుకుతారు. అక్కడి నుంచి ప్రదర్శనగా వెళ్లి జమ్మిచెట్టు వద్దకు చేరుకుని పూజారి సమక్షంలో పూజలు చేస్తారు. అక్కడికి వచ్చిన పెద్దలు, విద్యావంతులు 'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశనీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' అంటూ అందరితో శ్లోకాలు చదివించి వాటిని జమ్మి చెట్టు వద్ద కట్టి పూజలు చేస్తారు. చీటీని రాయించడం వల్ల శత్రు వినాశనం జరిగి విజయాలు చేకూరుతాయని నమ్మిక.

★ అనంతరం జమ్మి ఆకును సేకరించి పెద్దలకు పంపిణీ చేసి ఆశీర్వాదం తీసుకుంటారు. ఒకరికొకరు ఈ జమ్మి పత్రిని పంచుకొని శుభాకాంక్షలు చెప్పుకుంటారు. తరువాత శుభం కలగాలని కోరుకుంటూ పాలపిట్టను దర్శనం చేసుకుంటారు. ఈ సందర్భంగా ఇంటి ఆడపడుచుల మంగళహారతులు పట్టి జమ్మి పత్రిని పంచి నజరానాలు స్వీకరిస్తారు. భువనగిరి, నల్గొండ పలు పట్టణాలు, గ్రామాల్లో దసరా సందర్భంగా రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేస్తారు. రాత్రి బాణసంచా కాల్చుతూ పెద్దలు, చిన్నారులు కేరింతలు కొడతారు.




మోత్కూరులో జమ్మిచెట్టు వద్ద పూజలు జరుపుతున్న ప్రజలు (దాచిన చిత్రం)



పాలపిట్ట దర్శనం (దాచిన చిత్రం)

పల్లెపహాడ్‌లో విభిన్నం

తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తదుపరి వచ్చిన తొలి పండగ దసరా. నిజాంపై విజయం సాధించినందుకు ఆ రోజుకు గుర్తుగా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్ గ్రామంలో నాటి దళ నాయకుడు దాశిలి అయిలయ్య నేతృత్వంలో కమ్యూనిస్టులు పెద్ద బురుజు మీద ఎర్రజెండా ఎగరవేశారు. ఊరంతా ప్రదర్శనలు నిర్వహించి, దసరా పండగను జరుపుకున్నారు. నాటి నుంచి నేటి వరకు దసరా రోజున పల్లెపహాడ్ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీతో పాటు అన్ని పార్టీల వారూ జెండాలను ఎగరవేసి ఊరంతా ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకొంటున్నారు.



పల్లెపహాడ్‌లోని బురుజుపై జెండా ఎగరవేస్తున్న నాటి చిత్రం

ఏడు దశాబ్దాలుగా ఎర్రజెండా ఎగరవేస్తున్నాం..

– కుసుమాని హరిశ్చంద్ర, పల్లెపహాడ్



మా గ్రామంలో 70 ఏళ్లకు పైగా దసరా పండగ రోజు బురుజుపై ఎర్రజెండాను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తోంది. కమ్యూనిస్టు కార్యకర్తలు ఎర్రజెండాలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం దసరా వేడుకలు జరుపుకొంటారు. ఊరంతా పాల్గొనడం ఈ పండగ ప్రత్యేకత. మమ్ములను చూసి ఇప్పుడు అన్ని పార్టీల వారూ జెండాలు ఎగరవేసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

కొలువుల నిలయం.. బాపూజీ గ్రంథాలయం



గ్రంథాలయంలో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కోదాడ, న్యూస్‌టుడే:

ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక కల. ఆ కలను నిజం చేసుకోవాలంటే ఎన్నో త్యాగాలు, కష్టాలు భరించాల్సి ఉంటుంది. పేద కుటుంబంలో పుట్టిన వారికి సరైన వసతులు ఉండవు. దగ్గరలో ఉండే ప్రభుత్వ గ్రంథాలయాలే వారికి దిక్కు. వాటినే ఆసరాగా చేసుకొని అవకాశం అందిపుచ్చుకుంటే వారు ఎందరో. ఇలాగే కోదాడ పట్టణంలోని బాపూజీ గ్రంథాలయం ఉద్యోగాలకు నిలయంగా మారుతోంది. ఏకంగా 13 మంది ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఉద్యోగులు సాధించిన గ్రంథాలయంగా రికార్డు సృష్టించింది. గతంలో గురుకుల, పోలీసు, ఏఈఈ శాఖల్లో పలువురు ఉద్యోగాలు సాధించగా తాజాగా విడుదలైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఫలితాల్లో ఆ సంఖ్య అమాంతం పెరగడం విశేషం.

డీఎస్సీలో 13 మందికి ఉద్యోగాలు

రెండేళ్లుగా వస్తున్నా:

వెంకటేశ్వర్లు, కాపుగల్లు



గత రెండేళ్లుగా నిత్యం గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరవుతున్నా. డీఎస్సీ మిత్రులతో ఒకరికొకరు సంప్రదిస్తూ సందేహాలు ఉంటే నివృత్తి చేసుకుంటాం. ప్రణాళిక ప్రకారం చదవడంతోనే ఉద్యోగం సాధించా. కష్టానికి ప్రతిఫలం రావడం ఆనందంగా ఉంది.

ఆర్థిక ఇబ్బందులు అధిగమించి:

గ్రీష్మ, చెన్నారిగూడెం



పదేళ్ల క్రితం వివాహమైనా, అప్పటి నుంచి ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుతున్నాను. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ, వారి ఆలనాపాలన చూసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తూ సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి వచ్చి సాధన చేశాను. ఎట్టకేలకు ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యుల సహకారంతోనే ఈ కల నిజమైంది.

అమ్మ ప్రోత్సాహంతో:

వినీత, అనీనాబాద్



అమ్మ ప్రోత్సాహంతోనే చదివాను. నేను ఉద్యోగం సాధించడం అమ్మ కల. 2015లో వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నా భర్త ప్రోత్సాహం మరువలేనిది. 46వ ర్యాంకు రావడంతో ఉద్యోగం సాధించాను. గత దాదాపు నుంచి నిత్యం గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరయ్యాను.

సాయంత్రం ఆటో నడిపి..

ఉపేందర్, కొమరబండ




నిత్యం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఆటో నడిపి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలో చదివేవాడిని. వివాహం కావడంతో కుటుంబ ఖర్చుల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో నా కష్టాలు తీరిపోయాయి.

బుద్ధవనంలో ధమ్మ విజయ వేడుకలు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: బుద్ధవనంలో ధమ్మ విజయ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న సాగర్‌లోని బుద్ధవనంలో ధమ్మ విజయం వేడుకలను నిర్వహించనున్నట్లు.. ఈ కార్యక్రమానికి పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, లతారాజా ఫౌండేషన్ సలహాదారుడు పీఎస్ ఎన్‌మూర్తి పాల్గొంటారని పేర్కొన్నారు.

పల్లెకు పయనం

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65పై వాహనాలు శుక్రవారం బారులు తీరాయి. దసరా పండగను సొంతూళ్లలో నిర్వహించుకునేందుకు వాహనాల్లో వస్తుండడంతో చౌటుప్పల్ పట్టణంలో సందడి నెలకొంది. కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, లారీలు, సరుకు రవాణా వాహనాలు ఒకదాని వెంట ఒకటి హైదరాబాద్ వైపు నుంచి బారులు తీరి వస్తున్నాయి. సరకులు, నూతన వస్త్రాలు కొనేందుకు స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలవారు ఇక్కడికి వచ్చిపోతుండడంతో పండగ రద్దీ పెరిగింది. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



నృత్య వైభవం



యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. చెన్నైకి చెందిన శ్రీమైత్రి సెంటర్ ఫర్ ఆర్ట్స్ సరళ కుమారి బృందం భరత నాట్యం ప్రదర్శన చేపట్టింది. నాట్యాలయ బృందం కూచిపూడి, పేరిణి నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. – న్యూస్‌టుడే యాదగిరిగుట్ట

తొమ్మిది రోజులు చుక్కా, ముక్కా బంద్



అభంగాపురంలో దుర్గాదేవి వద్ద పూజలు చేస్తోన్న భక్తులు

మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. గ్రామస్థులంతా కులాలకతీతంగా ఒకే విగ్రహాన్ని నెలకొల్పి ఐక్యతతో పూజిస్తారు. తొమ్మిది రోజులు పూర్తయ్యే వరకు గ్రామంలో మద్యం ముట్టరు, మాంసం తినరు. ఇలా గత మూడేళ్లుగా కొనసాగిస్తున్నారు. చివరి రోజు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులంతా కుంకుమార్చన చేయటం ఆనవాయితీ. ఇలా చేయటంతో దుర్గాదేవి గ్రామాన్ని చల్లగా చూస్తోందని వారి నమ్మకం. తొమ్మిది రోజుల పూజ తర్వాత దసరా రోజు అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. దసరా రోజు కూడా మద్యం, మాంసం తీసుకోకపోవటం గమనార్హం. – మాడ్గులపల్లి, న్యూస్‌టుడే:

35 ఏళ్లుగా నగర సంకీర్తన

శరత్కాలంలో ప్రకృతిమాత నుంచి శక్తి సముపార్జన కోసం ఏటా దుర్గాష్టమి, నవమి, దశమి రోజుల్లో చౌటుప్పల్‌లోని శ్రీభావనారుషి కళానికేతన్ ఆధ్వర్యంలో గత 35 ఏళ్లుగా 'నగర సంకీర్తన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కళానికేతన్ వ్యవస్థాపకులు గంజి అనంతరాములు, వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగు శ్రీరాములు నేతృత్వంలో సద్దుల బతుకమ్మ నుంచి దసరా వరకు మూడు రోజులపాటు నగర సంకీర్తనను ప్రవేశపెట్టారు. ఇప్పటికీ కళానికేతన్ సభ్యులు వేకువజామున పట్టణంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ మద్దెల, తాళాలు లయబద్ధంగా మోగిస్తూ, దైవ స్తుతి కీర్తనలు ఆలాపిస్తూ.. శరన్నవరాత్రి, దసరా ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు.

★ 'ఇంటింటా భగవన్నామ సంకీర్తన సుధా స్రవంతి' పేరుతో ప్రతి పౌర్ణమి రోజున ఒక గృహస్థు ఇంట్లో భజన చేస్తున్నారు. ఇప్పటికి 96 వారాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

★ ఏటా 'భగవద్గీత జయంతి' ఉత్సవం, ★ ఉగాది రోజున సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలు జరుపుతున్నారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



చౌటుప్పల్‌లో నగర సంకీర్తన చేస్తున్న శ్రీభావనారుషి కళానికేతన్ సభ్యులు



బండెనక బండి కట్టి.. ఆలయ బాట పట్టి

మండల కేంద్రంలో కనకదుర్గమ్మ బండ్ల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గురువారం రాత్రి అమ్మవారికి ప్రభబండ్లు కట్టి పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి శుక్రవారం ఉదయం దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు కందాల ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, మునగాల

నాణ్యమైన విద్య కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు: మంత్రి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: కోటీశ్వరుల పిల్లల మాదిరిగానే పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెంలో రూ.300 కోట్ల వ్యయంతో



నల్గొండ: గంధంవారిగూడెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పైలాన్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి భూమి పూజ నిర్వహించారు.

★ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. అన్ని వసతులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవచ్చన్నారు. రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల వ్యయంతో మొదటి విడతలో 28 ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసుకుంటున్నామని వివరించారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీరు వదిలినప్పటికీ కాల్వలో చెట్లు, పూడిక వల్ల చివరి వరకు సాగు నీరు అందదన్న ఉద్దేశంతో తన సొంత నిధులతో కాల్వల్లో మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి రైతుల కాళ్లు కడిగినప్పుడే తన కల నెరవేరుతుందన్నారు.

వారం రోజుల్లో ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులు తీసుకుని రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. తెలంగాణలో రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి కేసీఆర్ కుటుంబమే బాగు పడిందని విమర్శించారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పిన కేసీఆర్ వాటిని అమలు చేయలేదని, ఆయన చెప్పిన వాటిని మేము చేస్తున్నామని, 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్య ఇస్తున్నామన్నారు. నల్గొండ నియోజకవర్గం అంటే తనకు ప్రాణమని చెబుతూ ఒక సారి ఓడినా నన్ను గుండెల్లో పెట్టుకుని గెలిపించుకున్నారని, మీ అందరిని కుటుంబ సభ్యులుగా భావించి కాపాడుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని రూపంలో దర్శనం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలో అనుబంధ శ్రీపర్వతివర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని దేవి అలంకారంలో అమ్మవారి దర్శనమిచ్చారు. పాత్రఃకాల పూజ, స్థాపిత దేవతా హవనం, అర్చన, పారాయణం, గాయత్రీ జపం, లలిత సహస్రనామార్చన నిర్వహించారు. శనివారం కలశ ఉద్వాసన, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.




సంస్కృతి సంబరం.. పల్లె బంధం

చిట్యాల, న్యూస్‌టుడే: పండగ అంటేనే.. సంస్కృతి, సంప్రదాయం, సంబరం. ముఖ్యంగా తెలుగు పండగలు ఈ విషయానికి ప్రతీకగా నిలుస్తాయి. అందులో దసరా ప్రధానమైనది. ఉద్యోగ, ఉపాధి అవసరాల రీత్యా పట్టణాలకు, నగరాలకు వలసవెళ్లిన జీవులంతా దసరాను సొంత గ్రామంలోనే జరుపుకోవడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఎక్కడున్నా దసరాకు ఊరికి చేరుకోవాల్సిందే. ఇవన్నీ ఒక ఎత్తు అయితే బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా.. అన్నీ కుంచించుకుపోతున్న మానవ సంబంధాలు మెరుగు పడటానికి దోహదం చేస్తాయి. కొందరు యువకులు దేవీ మాల పేరుతో మాలధారణ చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నియమ, నిష్ఠలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాంసాహారం, మద్యానికి దూరంగా సాత్వికాహారం తీసుకుంటారు. రెండు పూటలు అల్పాహారం, ఒక్క పూట మాత్రమే మిత భోజనం చేస్తారు. ఇది మాల ధారణ చేసిన వారిలో ఆధ్యాత్మిక భావన పెంచడంతో పాటు వారిని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచుతుంది. తద్వారా సాటి వారితో సత్సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది.



సొంత ఊర్లో స్వచ్ఛత కనిపిస్తుంది:

యాస శ్రీనివాసరెడ్డి, (హైదరాబాద్) చిట్యాల.



వివిధ కారణాలతో పట్టణాల్లో ఉంటున్నా, దసరాకు మాత్రం సొంతూరికి రావాల్సిందే. పట్టణంలో ఎంత మంది పరిచయం ఉన్నా, అవన్నీ ఆర్థిక పరమైన సంబంధాలుగానే కనిపిస్తాయి. ఊరికి వచ్చినప్పుడు కుల, మతాలకు తావు లేకుండా పరిచయం ఉన్న వారందరినీ వరసలు పెట్టి పిలుచుకుంటాం. అలాంటి పలకరింపుల్లో మన వాళ్లు అనే ఆప్యాయత, అభిమానం కనిపిస్తుంటాయి.

పాల పిట్టకు ఉచిత లారీ ప్రయాణం

జ్ఞాపకం

చిట్యాల, న్యూస్‌టుడే: దసరా పర్వదినం అనగానే పాలపిట్ట గుర్తుకొస్తుంది. సుమారు 40 ఏళ్ల క్రితం చిట్యాలలో లారీ యజమానులు గ్రామం వెలుపలకు వెళ్లి పాల పిట్టను తిలకించేందుకు తమ లారీలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచేవారు. లారీలను శుభ్రంగా కడిగించి, పూల దండలతో అలంకరించి, వాహన పూజలు చేయించేవారు. పాల పిట్టను చూడాలనుకునే వారి కోసం పంచాయతీ కార్యాలయం సమీపంలో లారీలను పార్కింగ్ చేసేవారు. అందులో ఎక్కిన వారిని చిట్యాల నుంచి నార్కట్‌పల్లి వైపు తీసుకెళ్లే వారు. మధ్యలో బహిరంగ ప్రదేశంలో పాల పిట్టను చూసి చిన్నారులు కేరింతలు కొట్టేవారు. ఆ తర్వాత లారీలను నార్కట్‌పల్లికి తీసుకెళ్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లగా అక్కడ స్వామి దర్శనం చేసుకునేవారు. అక్కడి నుంచి నేరుగా చిట్యాల మీదుగా రామన్నపేటకు వెళ్లే దారిలో చిట్యాల శివారులో ఉన్న శ్రీ బాల నరసింహ స్వామి ఆలయానికి తీసుకెళ్లి దర్శనం చేయించేవారు. చివరకు లారీని తీసుకొచ్చి చిట్యాల పంచాయతీ కార్యాలయం వద్దకు చేర్చే వారు. ప్రస్తుతం సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వారికి ఈ జ్ఞాపకం సుపరిచితమే.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

వారి విజయం వెనుక.. ఆయన శ్రమ

చౌటుప్పల్ బంగారుగడ్డ కాలనీలో ఒకే ఇంటికి చెందిన మహ్మద్ జావీద్ ఖాన్, ఖదీర్ ఖాన్, హసీనాలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. డీఎస్సీ-2024లో జావీద్‌ఖాన్ సెకండరీ గ్రేడ్ టీచర్‌గా నియామకపత్రాన్ని అందుకున్నారు. అతని భార్య హసీనా 2018లో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో టీజీటీగా ఉద్యోగం సాధించారు. అమె ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని గురుకులంలో గణితం బోధిస్తున్నారు. జావీద్ ఖాన్ తమ్ముడు ఖదీర్‌ఖాన్ గత జులైలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా ఉద్యోగం పొందారు. ఆయన ప్రస్తుతం వనపర్తి జిల్లా దీపనగుండ్ల గురుకులంలో ఆంగ్లం బోధిస్తున్నారు.

తమ తండ్రి అఫ్జల్ ఖాన్ నలభై ఏళ్ల నుంచి కిళ్లీ దుకాణం నడుపుతూ తమను చదివించారని, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం వెనుక ఆయన శ్రమ ఉందని జావీద్‌ఖాన్, ఖదీర్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



తండ్రి అఫ్జల్‌ఖాన్‌తో కుమారులు జావీద్‌ఖాన్, ఖదీర్‌ఖాన్

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ శ్రీపార్వతీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ కమిషనర్ హైదరాబాద్ వారు ఈనెల 10న నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజులలో సహాయ కమిషనర్, దేవాదాయశాఖ నల్గొండకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: లింగగిరిలోని శ్రీ సీతారామచంద్ర దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విరాళం

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి క్షేత్రంలోని రెడ్డి అన్నదాన సత్రం అభివృద్ధి కోసం మద్రూరు గ్రామానికి చెందిన బీరవోలు దయాకర్‌రెడ్డి, సునీల దంపతులు రూ.2లక్షల విరాళాన్ని సత్రకమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న వేడుకల మందిరానికి తమ విరాళాన్ని ఉపయోగించాలని కోరినట్లు దాతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. –వెంకన్న, కోదాడ

✔ పరిశీలించి వెంటనే వీధి దీపాలు అమర్చుతాం. –జానీ, ఎలక్ట్రీషియన్

మహిషాసురమర్దినిగా అమ్మవారు



హుజూర్‌నగర్ 25 వార్డులో..



నేరేడుచర్ల శివాలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు

న్యూస్‌టుడే బృందం: ఆలయాల్లో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అన్నదానాలు నిర్వహించారు. కోదాడలోని రామాలయంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు.



కీతవారిగూడెంలో..



కోదాడ: నయానగర్‌లో..



మునగాలలో..

శమీ పూజ.. ఇక్కడ ప్రత్యేకం

మఠంపల్లి, న్యూస్‌టుడే: అనాదిగా శమీపూజను మఠంపల్లి వాసులు ప్రత్యేక తరహాలో జరుపుకొంటారు. విజయదశమి రోజు ముదిరాజుల ఆధ్వర్యంలో గ్రామ శివారులో నిర్వహించే ఈ కార్యక్రమానికి స్థానికులంతా హాజరై జమ్మి చెట్టు వద్ద చేపట్టే ఆధ్యాత్మిక క్రతువుల్లో పాల్గొంటారు. 350 కుటుంబాల వరకు ఉన్న ముదిరాజులు దాదాపు ఏడు దశాబ్దాలుగా ఉదయం నాభి శిల వద్ద ఆయుధ పూజలు పూర్తయ్యాక సాయంత్రం గ్రామస్థులతో కలిసి తీగల చెరువు సమీపంలో కేటాయించిన స్థలానికి సామూహికంగా చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి రుక్మిణీ, సత్యభామా సమేతుడై శ్రీకృష్ణుడు, కనకదుర్గా దేవి ఆలయం నుంచి మహిషాసురమర్దిని అవతారంలో జగన్మాత భక్తగణాల జయజయధ్వానాలతో వచ్చి సకల జనావళికి దర్శనమిస్తారు. అనంతరం స్థానికులు జమ్మి పత్రాలు స్వీకరించి ఆలయాల్లో జరిగే అర్చనల్లో పాల్గొంటారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శమీ పూజకు కళా బృందాల ప్రదర్శనలు, భక్తి విభావరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.



శమీపూజ చేస్తున్న పురోహితుడు (పాత చిత్రం)

కబ్జాలు గుర్తించి.. ఆక్రమణలు తొలగించి

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిమిర్యాల, కాపుగల్లు పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను కోదాడ తహసీల్దార్ వాజీద్ శుక్రవారం తొలగించారు. ఈ నెల 10న 'గుట్టుక్కు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండు గ్రామాల్లోని రెవెన్యూ పరిధిలో గల 474, 101, 292 సర్వే నంబర్లలో కబ్జాకు గురైన 50 ఎకరాల భూమిని గుర్తించి మొక్కలను తొలగించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

స్పందనకు వందనం

అవీ ఇవీ

మాస కల్యాణోత్సవం.. అనంతగిరి: మండల కేంద్రంలోని శ్రీ రఘునాథ ఆలయంలో శుక్రవారం మాస కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమ దాతలు సాదు బ్రహ్మానందం, గాయత్రి దంపతులు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజియాదవ్ పాల్గొన్నారు.

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ ఆయన విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి: జిల్లా వైద్యాధికారి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రసవాల నమోదులో వెనక ఉందని జిల్లా వైద్యాధికారి కోటాచలం అన్నారు. ఈ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంపునకు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న అటెండరు పోస్టును త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఆసుపత్రి వైద్యాధికారులు సీతామహలక్ష్మీ, అశోక్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఫార్మసీలో మందులను పరిశీలించారు.

మునగాల: వైద్యశాల సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి కోటా చలం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించి, విధులకు హాజరుకాని సిబ్బందిని గురించి తెలుసుకున్నారు. విధులకు హాజరు కాని ఓ ఉద్యోగికి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

చింతలపాలెం: చింతలపాలెంలోని ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి కోటాచలం పరిశీలించారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను ఎంఎల్‌హెచ్‌పీ సచిన్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. గదులు, పారిశుద్ధ్యం ఇతరత్రా ఇక్కడ నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, విశ్వం, మా నాన్న సూపర్‌హీరో, వేట్టయన్, జనక అయితే గనక, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, మా నాన్న సూపర్ హీరో, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

క్రీడలతో మానసిక వికాసం

నడిగూడెం, న్యూస్‌టుడే: క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, మానసిక వికాసంతో పాటు శరీర దారుఢ్యాన్ని కలిగిస్తాయని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నడిగూడెంలో కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు.

కోదాడ పట్టణం: యువత క్రీడల్లో రాణించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపయ్య, సీనియర్ క్రీడాకారుడు ఆదామ్ అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దసరా సందర్భంగా ది కోదాడ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు.



నడిగూడెంలో కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ రామకృష్ణారెడ్డి

కోదాడ జూనియర్ సివిల్ జడ్జికి పదోన్నతి

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ పదోన్నతి పొందినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సబ్ కోర్టు అదనపు జడ్జిగా పదోన్నతి లభించింది. దీంతో కోదాడకు చెందిన న్యాయవాదులు శుక్రవారం జడ్జిని ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్, మోషె, హుస్సేన్, నాగరాజు పాల్గొన్నారు.



కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శ్యాం సుందర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

సరఫరా పునరుద్ధరించి పంటలను కాపాడండి

నడిగూడెం, న్యూస్‌టుడే: సిరిపురం నుంచి గెల్లోరిగూడెం వరకు ఉన్న విద్యుత్తు లైనుకు గత నాలుగు రోజులుగా సరఫరా నిలిచిపోవడంతో, మోటార్లు నడవక సాగులో ఉన్న పొలాలు ఎండుతున్నాయని రైతులు శుక్రవారం నడిగూడెం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విద్యుత్తు లైనుకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించి, పంట పొలాలను కాపాడాలని కోరారు. రైతులు చిన లింగయ్య, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, నరేష్, నర్సింహారెడ్డి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక సమయం పనిచేసి వైభవం పెంచాలి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ శతాబ్ది సార్వజనీకోత్సవం శుక్రవారం నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్ నుంచి విజయదుర్గ ఆలయం వరకు పదసంచాలన్ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో నల్గొండ విభాగ్ శరీరక్ ప్రముఖ్ బేతి కన్నయ్య మాట్లాడుతూ స్వయం సేవకులు శతాబ్ది పిలుపును అందుకుని అధిక సమయం పనిచేసి భరతమాత వైభవాన్ని పెంపొందించాలని ఉద్బోధించారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే: సీపీఎం



వల్లాపురంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

నడిగూడెం, న్యూస్‌టుడే: పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది, ప్రజల హక్కులు సాధించేది ఎర్రజెండానే అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వల్లాపురంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామ శాఖ కార్యదర్శిగా పి.హనీఫ్‌ను ఎన్నుకున్నారు.

చిలుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించి లబ్దిదారులకు అందజేసిన రెండు పడక గదుల ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బేతవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న బేతవోలులో జరిగే సాయుధ పోరాట యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు తాళ్లూరి భద్రయ్య వర్ధంతి సభలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మోతె: సీపీఎం మండల కార్యదర్శిగా ములుకూరి గోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపల్లి సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనుల పండువగా.. బండ్ల జాతర



మునగాల, న్యూస్‌టుడే: మునగాలలో జరిగిన బండ్ల జాతరలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా వనవాసానికి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి ప్రతాపరెడ్డి, రామిరెడ్డి, జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనానికి ఏర్పాటు చేసిన ప్రభ బండి

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఎక్సైజ్ అధికారులు మూడు రోజులుగా విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. చింతలపాలెం మండలం ఎర్రకుంట తండాకు చెందిన చంటి బెల్లం, పటికను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన గోపి ద్విచక్రవాహనంపై 100 కిలోల బెల్లం, 10 కిలోల పటికను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. చింతలపాలెం మండలం నక్కగూడెం తండాకు చెందిన వెంకటేష్, గరిడేపల్లి మండలం శీత్లాతండాకు చెందిన గుగులోతు శ్రీను, మఠంపల్లి మండలం పాత దొనబండ తండాకు చెందిన బాణోతు పీక, అదే మండలం కాల్వపల్లి తండాకు చెందిన భూక్యా తేజలను వేర్వేరు చోట్ల పట్టుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 230 కిలోల బెల్లం, 20 కిలోల పటికను, 50 లీటర్ల సారాను, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరుచుకొని, ఆరుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నడిగూడెం: తపాల శాఖ అమలు చేస్తున్న పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప తపాల శాఖ అధికారి భానుశ్రీ కోరారు. జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నడిగూడెంలో తపాల కార్యాలయం ఆవరణలో స్వశక్తి కిరణ్ దివస్ నిర్వహించారు. పలు పొదుపు పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. డి.వీరబాబు, శరత్ పాల్గొన్నారు.

ఆత్మీయంగా పలకరించుకొని..!

నడిగూడెం, న్యూస్‌టుడే: వారంతా 18 ఏళ్ల క్రితం సిరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తిరిగి శుక్రవారం అందరూ పాఠశాలలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

సూర్యాపేట
• సూర్యాపేట • తుంగతుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలో తహసీల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. సీసీ రహదారిపై గుంతలు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. – పవన్, సూర్యాపేట

✔ మరమ్మతు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

? సూర్యాపేటలోని బాషానాయక్‌తండాలో సీసీ రహదారి అధ్వానంగా మారింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. – రవి, బాషానాయక్‌తండా

✔ పరిశీలించి మరమ్మతు చేపడతాం.
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని అంబేడ్కర్‌నగర్‌లో మురుగు కాల్వల్లో పూడిక తీయటం లేదు. మురుగు నిలిచి దుర్వాసన రావడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. –నరేశ్, అంబేడ్కర్‌నగర్

✔ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం.
– సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర పదవులకు ఎంపిక

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పదవులకు ఎంపికయ్యారని మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సంధ్యాల వినోద్, నల్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నెమ్మని వెంకటేశ్వర్లు, యరగాని లింగయ్య, మామిడి వెంకటయ్య, జమాల్ షరీఫ్, కోనుగంటి గవాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొచ్చర్ల ప్రభాకర్, యర్రంశెట్టి రవీందర్, రాచూరి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శిగా బొమ్మిడి కృష్ణయ్యను ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

శమీ పూజకు వేళాయె

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో శనివారం విజయ దశమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పురపాలిక అధికారులు ఏర్పాటుచేస్తున్నారు. దసరా సందర్భంగా జమ్మిగడ్డ కాలనీలో శమీ(జమ్మి) చెట్టుకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు జమ్మిగడ్డలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జమ్మిచెట్టును సిద్ధం చేశారు. పట్టణ ప్రజలు సాయంత్రం 4 గంటలకు పాలపిట్టను చూసిన తర్వాత జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి, వేదిక, విద్యుత్తు దీపాలు అమర్చుతున్నారు. సంతోషిమాత దేవస్థానం ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలు అలంకరించారు. పట్టణ ప్రజలు విజయ దశమి పూజల అనంతరం ఈ విగ్రహాలను సందర్శిస్తారు. పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో తొక్కిసలాట జరగకుండా పుర అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

☛ సూర్యాపేటలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జమ్మిపూజ ఏర్పాట్లను పుర కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పలు సూచనలు చేశారు. ఏర్పాట్లను పుర డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సిబ్బంది పరిశీలించారు.

నేడు శమీ ఉత్సవం

సూర్యాపేట సాంస్కృతికం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో శమీ ఉత్సవం నిర్వహిస్తున్నామని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయ అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ శుక్రవారం తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై శమీచెట్టు వద్దకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.


సూర్యాపేట ఎంపీడీవో కార్యాలయంలో జమ్మిపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుర కమిషనర్ శ్రీనివాస్, అధికారులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అర్వపల్లిలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లిలోని చైతన్య భారతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అర్వపల్లిలోని శ్రీరామా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ఆటాపాటలతో అలరించారు. తమకు విద్య నేర్పిన గురువులు కేసగాని మహేశ్వర్, చంద్రశేఖర్, కుంభం సోమయ్య, ధారం శ్రీనివాస్, పగిడిమర్రి రామ్మూర్తి, పొన్నం శ్రీనివాస్, సంద్ర రవీందర్, దయాకర్, అయోధ్య, శ్రీనివాస్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు.

ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి

జాజిరెడ్డిగూడెం: జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని శుక్రవారం పూర్వ విద్యార్థుల కమిటీ సమావేశంలో తీర్మానించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పుతామని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బింగి కృష్ణమూర్తి, ఎల్లెంల కొమిరెల్లి, శ్రీశైలం, వెంకటనారాయణ, సోమశేఖర్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

వెండి కిరీటాల బహూకరణ

నూతనకల్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ పార్వతీసమేత శంభులింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి, విఘ్నేశ్వర స్వామికి భక్తులు వెండి కిరీటాలను శుక్రవారం బహూకరించారు. పార్వతి దేవికి మండలకేంద్రానికి చెందిన భాజపా నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్ దంపతులు 400 గ్రాముల వెండి, విఘ్నేశ్వరస్వామికి మెడికల్ షాప్ యజమాని బయ్య రవి దంపతులు 400 గ్రాముల వెండితో కిరీటాలు తయారు చేయించారు. వీటిని వారి ఇంటి నుంచి ఆలయానికి మేళవాయిద్యాలతో తీసుకువచ్చి వేదపండితులు శ్రీరామ శర్మ, శాస్త్రిలకు అందజేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం పార్వతి, విఘ్నేశ్వర స్వామి విగ్రహాలకు వెండి కిరీటాలను అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చురకంటి చంద్రారెడ్డి, విఠల్‌రెడ్డి బొడ్డుపల్లి అంజయ్య, బత్తిని లక్ష్మయ్య, యాస ముత్తారెడ్డి పాల్గొన్నారు.


నూతనకల్‌లోని శ్రీపార్వతి సమేత శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వెండి కిరీటాలు అందజేస్తున్న కాప రవి కుమార్, బయ్య రవి దంపతులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేసి భరోసా కల్పించారు. మండలంలోని మాచారం గ్రామానికి చెందిన గద్దల సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయనకు భార్య దీపిక, కుమార్తె ఆర్వీ ఉన్నారు. అతని స్నేహితులు, పెన్‌పహాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు చందాలు పోగేసి రూ.1.18 లక్షలను మృతుడి కుమార్తె పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్లను శుక్రవారం అందజేశారు.


మాచారంలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మహిషాసురమర్దినిగా అమ్మవారు


సూర్యాపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సూర్యాపేటలో వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని కనకదుర్గ, సంతోషిమాత ఆలయం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష పూజలను అర్చకులు నిర్వహించారు.

నూతనకల్: తాళ్లసింగారంలో దుర్గాభవాని ఫౌండేషన్ సభ్యులు చండీయాగం నిర్వహించగా.. యడవెల్లి, చిల్పకుంట్లలో అన్నదానం చేపట్టారు.

పెన్‌పహాడ్: ఎన్.అన్నారం బొడ్రాయివీధిలో మండపం వద్ద అన్నదానాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేశ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. లింగాలలోని కనకదుర్గ దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. చెట్లముకుందాపురంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండమీది గోవిందరావు అన్నదానాన్ని ప్రారంభించారు.

నూతనకల్ గ్రామీణం: మాచనపల్లి, ఎర్రపహాడ్, అల్గునూరు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు.


చెట్లముకుందాపురంలో దుర్గాదేవి మండపం వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండమీది గోవిందరావు

అందరికీ శుభం చేకూరాలి: ఆర్డీఆర్



సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: లోక కంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, దుష్టశక్తులపై దైవశక్తుల విజయానికి ప్రతీకగా విజయ దశమి జరుపుకొంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అన్నింటా శుభం చేకూరాలని, ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు.

14 నుంచి గట్టికల్లులో మద్యపాన నిషేధం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని గట్టికల్లు గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు సహకరించాలని కోరుతూ గ్రామస్థులు శుక్రవారం ఎస్సై వై.సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 14 నుంచి గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని గాంధీ జయంతి రోజున గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారని పేర్కొన్నారు. మద్యం తాగిన వారు అనారోగ్యం పాలవుతున్నారని, ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మద్యపాన నిషేధ అమలు కమిటీ సభ్యులు పల్స వెంకన్న, రమేష్ గౌడ్, సతీష్, మధు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల, న్యూస్‌టుడే: మండలంలోని ముకుందాపురం గ్రామస్థుడు పుప్పాల నర్సయ్యకు చెందిన రూ.50 వేల విలువైన గేదె విద్యుదాఘాతంలో శుక్రవారం మృతిచెందింది. వ్యవసాయక్షేత్రంలో గేదెను మేపుతున్న క్రమంలో కరెంటు తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఆయన తెలిపారు.

అతివేగం ప్రమాదకరం


చందుపట్లలో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌రెడ్డి

చివ్వేంల, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి.వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన పోలీస్ కళాజాత అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు నడపొద్దని సూచించారు. రహదారి భద్రత నిబంధనలు పాటించాలని, అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. ఏఎస్సై సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధికి దూరంగా తుంగతుర్తి: భారాస

తుంగతుర్తి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనలో తుంగతుర్తి పట్టణం అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబాటుకు గురవుతోందని భారాస మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నాయకులు తుంగతుర్తిలో ఏర్పాటు చేయాల్సిన మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించారని, ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తుంగతుర్తిలో ఏర్పాటుచేయకుండా వేరే ప్రాంతంలో నిర్మిస్తున్నారని తెలిపారు. సమావేశంలో రాములుగౌడ్, సాయిలుగౌడ్, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నాగమల్లు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ సరికాదు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తిలో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న అభివృద్ధి సాధన సమితి నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సమితి నాయకులు తెలిపారు. తిరుమలగిరిలో జరిగే యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపనను అడ్డుకుంటారని ముందస్తుగా శుక్రవారం తెల్లవారుజామున సమితి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదలయ్యాక వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న తమను అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో సంతోశ్, మల్లేశ్, వెంకటేశ్, నాగమల్లు, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుండగాని మల్లయ్య

తుంగతుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గానుగబండకు చెందిన గుండగాని మల్లయ్య(58) ఈ నెల 3న పొరుగున ఉన్న అన్నారం గ్రామంలోని తన కుమార్తె ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో ఆటోను తప్పించే క్రమంలో మరో ద్విచక్ర వాహనదారుడు మల్లయ్యను ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏడుకొండలు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చివ్వేంల, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలిక పరిధిలోని దురాజ్‌పల్లి సమీపంలో గల మూసీ కాలువ సుడిగుండంలో సుమారు 55 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు పశువుల కాపరులు శుక్రవారం సుడిగుండంలో మహిళా మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కాళ్లు, చేతులకు వెండి కడియాలతో పాటు చెవులకు కొన్ని బంగారు ఆభరణాలు ఉన్నాయి. మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పురపాలిక సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.